# ఉత్తిష్ఠంతు భూతపిశాచాః

ఏడుగంట కొప్పినం కక్కమ్మగారు మంచంపట్టింది——.

ఇంటెదురుగావున్న కొళాయిదగ్గర గోల సగం తగ్గింది.

వెంకటప్పయ్య తిరపతి యాత్రకి పోయాడు——.

ఊరంతా కొంత ప్రశాంతంగా వుంది.

హుజూరువారు పేరంటానికిదయచేశారు.

ఇంట్లో కాకిమీంచీ పిచికమీంచీ ఇరుగు పొరుగు వారిమీదికి ప్రసరించే కాంతా సమ్మిత కావ్యధ్వనుల హడావుడి కాస్త తగింది.

సమయం కొంత సజావుగా వుంది.

పత్రికా సంపాదకుడు ప్రత్యేక సంచికకు పెట్టిన గడువు దాటిపోవచ్చింది.

ఇవాళ కథ యెలాగేనా వ్రాసెయ్యాలి_
వ్రాసెయ్యాలి యెలాగేనా కథ ఇవాళ_
కూచున్నాను....
కటకటాల వీథివరండాలో
కాలు కుర్చీలో
సృష్టినిష్ఠలో పరమేష్ఠిలా....

సిగరెట్టు పొగల్లో విస్తృత గంధర్వ నగరాలు నిర్మిస్తోంది.

కథను సరికొత్త టెక్నిక్ లో అతివాస్తవికమైన సన్నివేశంతో.

రాయాలని సంకల్పం.

పూర్వం పత్రికలూ, రేడియోలూ, ప్రయాణసౌకర్యాలూ లేకపోయినా కళింగదేశంలో బయల్దేరిన తెలుగు కథ కంచిదాకా వెళ్ళేదిట!

కంచి ఒకప్పుడు తెలుగుదేశాని కొక పొలిమేరట!

కథ కంచికి వెళ్లడమంటే అర్థం అదే కాబోలు!

అదీ కథంటే!

జిహ్వలపై సజీవంగా ప్రయాణించేది.

ఆయా వివిధ కాల దేశాల కథకుల అభిరుచులు అప్పటప్పటిపాథేయంగా.

కథకథగా బతికేది.

తరతరాల అవ్వా తాతల పుక్కిటి పురాణంగా.

చిలవలుపలవలుగా చిరంజీవిగా.

ఆ వెనకటి కథలన్నీ కంచికి పోయాయి.

కాలధర్మం చేశాయి.

కైలాసమో, వైకుంఠమో చేరుకుని వుంటాయి.

అవి మనకిప్పుడక్కరకు రావు.

ఇప్పుడూ సరికొత్త పద్ధతిలో ఒక కథ రాస్తే.

టెక్నిక్ సరిహద్దులో కథ పొలిమేరలే దాటిపోతుంది. అచ్చుకెక్కినా ఇప్పటి కథలు చాలామటుకు వెంటవెంటనే చచ్చిపోతున్నాయి. చెమ్మతగిలిన అప్పడాల్లా.

అయితేనేం అందులో చాలామట్టుకు అవి చలామణీలో వున్నంతకాలం నిజాయితీతో బతికినవి.

## యస్వీ జోగారావు

చలామణీ వున్నంతమేర వాస్తవికతను వాయనాలుగా పంచిపెట్టినవి.

* * *

'ధాతా యథాపూర్వ మకల్పయత్' అన్నారు పెదలు. కాని 'అహంబ్రహ్మాస్మి' అని అనుకొనేటంత అహంభావం లేదు నాకు.

యథాప్రకృతంగా కథరాయాలని సంకల్పించాను. చుట్టూవున్న లోకం వైపొక చూపుసారించాను. అబ్బో ఎన్ని పాత్రలు! ఎన్ని సన్నివేశాలు! ఎన్ని వింతలూ విచిత్రాలు!

అయితే ఆ పాత్రధారు లందరూ పరిచితులు! మర్యాదస్థులు! పరిస్థితులకు బానిసలు! అందరినీ ఎగాదిగాచూస్తున్నాను.

ఒకరొకరే మొహాలు తప్పించుకుంటున్నారు. మాటలు ముడుచుకుంటున్నారు. చాటుచాటుగా మెటికలు విరుస్తున్నారు. శాపనార్థాలు పెడుతున్నారు.

'కథకుణ్ణని మహా పోజుగా కలం పెట్టేవు లేగాని తెల్లారిలేస్తే నిత్యం మొగం మొగం చూసుకోవలసినవాళ్ళం, ఏదో మనం మనం బరంపురం అని సరిపెట్టుకోవాలిగాని నీకీ అంత ముక్కున మొగమాటం లేకుండా, అక్కడికి నువ్వే మహానిజాయితీపరుడివి అయినట్టు మా గురించి కథ లెలాగ చెక్కుతావయ్యా' అని నిలదీసి అడుగుతున్నారు.

అవును వాళ్ళన్నదీ నిజమే!

ఆ మొగమాటంవల్లె నా ఊహ లన్నిటినీ ఊట కలం చేతపట్టి నా మాటల్లోకి సరిగా తరుమా చెయ్యలేకపోతున్నాను. నా కలం చెక్కిన కథలో నా నిజాయితీ నజరాయిషీ చేసుకోలే దింతవరకూ ... చేసుకోవాలనుకొంటున్నా......

అడిగో మా రామప్పంతులు
హడావుడిగా వస్తున్నాడు ఆఫీసునుంచి
ఎండా వానా లేకపోయినా ఏకచ్ఛత్రాధిపత్యం వహించి!
ఆఫీసరు వెనకాతలే అడుగులు వేస్తూ
అంతలో రెండుచినుకులు పడేసరికి
ఒక్కఅంగలో ఆయనను సమీపించి గొడుగుపట్టి
ఆయన చెవిలో ఏదోగొణిగి ఇంటిదాకా సాగనంపి
తిరుగుముఖం పట్టేడు.
అధికారికి పొక్కులు చిక్కుతూ వెంకటప్పయ్య బాగుపడి
పోతున్నాడని గోలెత్తేడు వెనక
అపొక్కులు చిక్కే అవకాశం తనకు లభించలేదనుకుంటూ.
ఎట్టకేలకెటాగో ఇప్పుడా అవకాశం లభించిందతనికి.
ఆఫీసరు బదలాయింపుతో "పోలసీ" పిరాయించాడు రామప్పంతులు.
కాని అపొక్కులు చిక్కడంతో ఊరు

(64-వ పేజీ చూడండి)

## ★ ఉత్తిష్ఠంతు భూత పిశాచాః ★

(13-వ పేజీ తరువాయి)

చింతిస్తున్నాడా మరి

తనకి కిట్టనివాళ్లందరిమీదా చాడీలు చెప్పడం ప్రారంభించాడు.

తనకి షష్టిపూర్తయిపోయినా సర్వీసులో ఇంకా ఈడిగిలబడుతూ

ఏ తైలాలు దట్టించినా నిండని సుబ్బారాయుడు పేగం పెంచను పుచ్చుకునే ఉపాయం గురించి ఆలోచిస్తున్నాడు.

రామబ్రహ్మంగారు మా వీధి మలుపు తిరిగే సరికి నా దృష్టి మా ఎదురింటి ఏకాంత రామయ్యగారిమీద పడింది.

ఆయన వసారాలో వాలుకుర్చీలో కూచుని వాసాలవైపు చూస్తున్నాడు.

ఆయనగాని అలాగు తీరుబాటుగా వాలుకుర్చీలో కూచుని వాసాలకేసి చూస్తూ ఆలోచిస్తున్నాడంటే మన్నాడెవరికొంపో ముంచేడన్నమాటే.

పాపం ఆయన కొంపలెన్ని తీసేసేం ఊరవతల వీరాంజనేయస్వామివారికో కోవెల కట్టించేడు!

బ్లాకుమార్కెట్టులో లోకాన్నంత దోసేసేం ఆ మధ్య ఏడుకొండలవాడికి పెళ్లాంచేత నిలువుదోపు ఇప్పించాడు!

అబ్బో ఆయన ఇంకా ఎన్ని ఘనకార్యాలు చేశాడని!

చెఱువులుత్రవ్వించెను! చెట్లునాటించెను..

ఎక్కడ? తన స్వంత మొఖాసాలో

అతనికంటె ఘనుడు ఆచంట మల్లన్న!

ఏకాంతరామయ్యగారి ఇంటి పక్కనే వున్న ఇంజనీరుగారు!

ఆయన దొరతనంవారికి ఎన్ని బ్రిడ్జిలు కట్టేడు! ఎన్ని డాములు కట్టించేడు! ఎన్ని రోడ్లు వేయించేడు!

అయితే సర్కారువారికేదికట్టినా ఆ కట్టినప్పుడలా తన సొంతానికో పెద్దమేడ కట్టిస్తూ వుండేవాడు! కాని పాపం కొన్నేసంపడి ఆ మేడలన్నీ తన సొంతానికే ఉంచేసుకున్నాడా మరి!

ఎవరడిగితే వాళ్లకే ఇచ్చేశాడు అద్దెకి!

ఆ మధ్య తన బంధువులు వైరిభాగుల కులయ్యకు కాంతమ్మను కట్టబెట్టినప్పుడు 'కాకిముక్కుకు దొండపండు' సామెత పాడించింది తాయారక్క.

'తనంత అందగత్తె మరిలేదని ఏం మిడిసిపోయింది కాంతమ్మ! గుంటకి తగిన శాస్తి జరిగిం'దని సంతోషించింది చుక్కమ్మ.

ఒకరోజున కాంతమ్మ ఎదరింటి దర్జీవాడితో లేచిపోయిందన్నారు.

'జంత ఎంతపని చేసిందీ!' అని మెటికలు విరిచింది తాయారు.

'అయ్యో ఆ దర్జీసాయిబు నన్ను నమ్మించి ఎంత దగా చేశాడూ విధవ!' అని కడుపులో అరటిపళ్లు పిసుక్కుంది చుక్క.

'మనం ఉత్తినే మాటి మాటికి ఇక్కడా అక్కడా కలుసుకోవడం బాగుండదండీ ఎవరైనా చూస్తే అపోహ పడతారు' అంది సరళ క్లాసుమేటు కామరాజుతో.

'అపోహపడతారని కాదు నీ భయం— అసలు సంగతి బోర్లేసుకుంటారని, ఆ రామారావు టామ్ టామ్ చేస్తాడని'

'అవును మరి. అవసర నైవేద్యంలా గున్నాను మీ మట్టుకి నేను. పెళ్లి చేసుకుంటాననడానికి దమ్ములేవు మీకు. ఇకనైనా నామానాన నన్ను మర్యాదగా బతకనియ్యండి.'

'అదిగో మరలాగంటే నే! నీ కోసం ప్రాణమైనా ఇవ్వడానికి సిద్ధం. అసలు నువ్వు లేకపోతే బతక లేను.'

'అదో మాటవరస పోనిత్తురూ. అలాగనడం ఈ కాలం కాలేజీకుర్రాళ్ల ప్రేమ కలాపాల్లో మామూలైపోయింది. ఇంతకీ మీ ప్రాణం బలికోరడానికి నేనేం రాకాసినికాను. అవుతర మిచ్చేద్దురూ చాలు మీకు పుణ్యముంటుంది.'

సరళచే నిరాకరింపబడి, కామరాజంటే ఈర్ష్యపడే రామారావు వాళ్ల మీద 'స్కాండల్సు' మొదలెట్టేడు. సరళ కామరాజుకి రాసినట్టు ఉత్తరం చేజిక్కించుకుని సరళను 'బ్లేక్ మెయిలు' చెయ్యడం మొదలెట్టేడు.

ఒకరోజు కామరాజు, రామారావులకు సరళా కృష్ణారావుల వివాహ శుభలేఖలు వచ్చేయి. ఇద్దరికీ కళ్ళుతచ్చుబారేయి.

సరళ తనకి దక్కకపోతే మానె, కామరాజుకి దక్కలేదని సంతోషించాడు రామారావు!

ఆమెను అక్కసుదీరా ఆడిపోసుకోవడంలో రామారావుతో రాజీపడ్డాడు కామరాజు—

ఆమె లేకపోతే బతక లేనన్న పెద్దమనిషి!

ఆమెకోసం ప్రాణత్యాగం చేస్తానన్న మహర్షి!

ఇలాగు చుట్టూచూసుకుంటే—

ప్రపంచంలో ఎన్ని చిత్రవిచిత్రమైన పాత్రలు!

ఒక్కొక్క పాత్ర జీవితంలో

ఎన్నెన్ని వింత వింత సన్నివేశాలు!

ఒక్క మట్టిమీద ఒకేతీరుగా వగ్నంగా

పుట్టేమానవుల మనస్తత్వాల్లో

ఎంత వైవిధ్యం! ఎంత వ్యత్యాసం!

స్వార్థంలోమాత్రం ఎంత సమానత్వం!

ప్రస్తుతం నాకథకి ఏపాత్రను గ్రహించడం? ఏ సన్నివేశాన్ని ఎన్నుకోవడం? అని ఆలోచిస్తున్నా.

ఇంతలో పేరంటానికి పోయిన మా శ్రీమతి వాయనం పట్టుకు వచ్చింది.

వీధి చీడీలో వున్న నన్ను పలకరించకుండానే ఇంట్లోకి మా పెద్ద విసురుగా వెళ్ళిపోయింది.

'ఏమిటీ చెప్మా సరాసరి పేరంటంనుంచి రాగానే ఇలాంటి వాలకం వేసింది!' అనుకుంటున్నాను.

'ఏమండీ మాట' అంది తంచనుగా లోపలినుంచి.

'కాస్తవుండు కథ మంచిపట్టులో వుంది' అని మనవి చేసుకున్నాను.

'ఈ కథకేంగాని మీ అసలుకథ బయటపడింది లెండి.'

నేను సరిగ్గా వినిపించుకోకుండానే 'అప్పుడే పడిందా? పత్రికకి పంపించి ఇంకా పదిరోజులు కాలేదు! అప్పుడే నా కథంటే పత్రికలవాళ్లు...' అని ఇవతలనుంచే కుర్చీలోంచే అంటున్నాను.

'ఏం విత్రిభాగులవారండీ! అవునుగాని? ఉదయినికలా ఈ తిరం రాస్తారా మీరు?' అని ఏదో కొత్తస్వరం పెట్టి గద్దించింది.

ఈ తిప్ప సరకాయాల!—

కుర్చీలోంచి లేచాను.

లేస్తూనే 'ఉదయినికేమిటి? నేనేమిటి! ఈ తిరమేమిటి! రాయడమేమిటి!' అని బిక్కమొగం వేసినా తెగించి ఒక్కబిగిని అనేశాను.

'మీ సంగతులు నాదగ్గర దాచకండి. నాకంతా తెలిసిపోయింది లెండి' అంది సాక్ష్యబలం చూసి తీర్పివ్వడానికి సిద్ధంగా వున్న జడ్జీలా.

పేరంటానికి వెళ్ళి తెచ్చిన వాయనం ఇదా అనుకున్నాను.

అయినా 'ఎవళ్ళన్నారంట నీతో నేనుదయిని కుత్తరం రాశానని?' అని మొరాయించాను.

'ఎవరో ఒకళ్లనడమేమిటి ఖర్మ! లోకమంతా కోడైకూస్తూ వుంటేను.'

'అసలెవళ్లన్నారో చెబుదూ!'

'పేరంటం కొచ్చిన అమ్మలక్కలందరూ అదేమాట! వెంకటప్పయ్యగారి పెళ్లాంతో కక్కమ్మగారు చెప్పిందిట!'

'కాదు వెంకటప్పయ్యే కలిపించుంటాడు. ఇక్కడ నాకీ పేటకం పెట్టేసి తిరపతి పోతాడా తాను? కక్కమ్మ వెంకటప్పయ్యా పుణ్యం గట్టుకుంటే ఇంకేమన్నా వుందా? పుకార్లు కథలుగా వేస్తారు. కథలు పొలిమేరలు దాటిపోతాయి' అని విసుగ్గా మళ్ళొచ్చి వీధి వరండాలో కుర్చీలో కూలబడ్డాను.

అసలు కథానుసంధానమింకా కానేలేదు.

మధ్యలో 'పతాక' లా ఇదొకటి వచ్చి పడింది.

బుర్ర గిర్రున తిరుగుతోంది.

పాత్రలూ సన్నివేశాలూ పటాపంచలై పోయాయి.

'ఉత్తిష్ఠంతు భూత పిశాచాః!' ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad